సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



రక్తదానమే లక్ష్యంగా

రక్తదానం కోసం ఏర్పాటు చేసిన ఒక వాట్సప్ గ్రూపు ఏకంగా ఇప్పుడు 200 మంది సభ్యులకు చేరింది. రక్తదానమే పరమావధిగా ఆ గ్రూపు సాగుతోంది. 8లో ▸



కుటుంబ కలహాలే కారణమా!

తణుకు సజ్జాపురంలో నివసించే గుమ్మళ్ల శాంతి కాలువలో శవమై తేలింది. కుటుంబ కలహాలతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. 8లో ▸



తాబేళ్ల రక్షణకు చర్యలు

తాబేళ్ల సంరక్షణకు చర్యలు చేపట్టారు. నరసాపురం మండలంలోని తాబేళ్ల గుడ్ల సేకరణ, పునరుత్పత్తి కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. 8లో ▸

న్యూస్‌రీల్

బలివే తీర్థానికి తమ్మిలేరు నీరు విడుదల



తమ్మిలేరు నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

చింతలపూడి: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని బలివే తీర్థానికి తమ్మిలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేసినట్లు తమ్మిలేరు ఇరిగేషన్ డీఈ సీతారామ్ మంగళవారం తెలిపారు. ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి 100 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి విడుదల చేశామని తెలిపారు. దాదాపు 40 కిలోమీటర్లు ప్రధాన కాల్వ ద్వారా ప్రయాణించి నడిపల్లి చెరువులోనికి చేరుతుందని చెప్పారు. అక్కడి నుంచి బలివేకు భక్తుల కోసం నీటిని వంతుల వారీగా తరలిస్తామన్నారు. బలివేకు వచ్చే భక్తులకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మొత్తం తీర్థానికి 500 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాతిరుమల: గురుకులంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థినుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బి.రాణి తెలిపారు. మార్చి 6తో ఈ గడువు ముగుస్తుందన్నారు. అర్హులైన విద్యార్థినులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1న అడ్మిట్ కార్డులు జారీ, అదే నెల 6న ఉదయం 10 గంటల నుంచి 5వ తరగతి ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఏడాదికి లక్ష రూపాయలు కలిగిన ధ్రువీకరణ పత్రం ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు 2012 సెప్టెంబర్ 1 నుంచి, 2016 ఆగస్టు 31 మధ్య జన్మించాలన్నారు. జూనియర్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే వారికి 2025 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదన్నారు.

నరసాపురం ఆసుపత్రిలో దివ్యాంగుల పాట్లు



సదరం సర్టిఫికెట్ల పరిశీలన కోసం వేచి చూస్తున్న దివ్యాంగులు


నరసాపురం: నరసాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం దూరప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు నానా ఇబ్బందులు పడ్డారు. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో ఆసుపత్రికి పిలిపించి గంటల సేపు నిలబెట్టారు. దీంతో దివ్యాంగులు అవస్థలు పడ్డారు. ఆసుపత్రిలో గత 15 రోజుల నుంచి సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ క్యాంపు నిర్వహిస్తున్నారు. నరసాపురం, మొగల్తూరు మండల పరిధిలో గతంలో సదరం సర్టిఫికెట్లు పొందిన వారిలో ఫేక్ సర్టిఫికెట్‌లు గుర్తించడం కోసమని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల ద్వారా దివ్యాంగులను ఆసుపత్రికి పిలుస్తున్నారు. వారికి టైం స్లాట్‌ల సౌకర్యం, వెలుసుబాటు కల్పించకపోవడంతో ఉదయం 9 గంటలకు వచ్చిన వారు సాయంత్రం 5 గంటల వరకూ వేచి ఉండి ఇబ్బందులు పడుతున్నారు.

నిరుద్యోగుల్లో నిరుత్సాహం

ఏపీలోని యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తాం. పరిశ్రమలు తెస్తాం. ఉద్యోగాలిస్తాం. హైటెక్ టవర్లు నిర్మించి వర్క్‌ఫ్రం హోమ్ తెస్తాం. మీకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటాను.
– పశ్చిమ గోదావరి జిల్లా ఎన్నికల సభల్లో చంద్రబాబు

రాసిపెట్టుకోండి తమ్ముళ్లు.. అధికారంలోకి వచ్చాక ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తాం. మొదటిగా 2025 జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం.
– జిల్లాలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్

- జాడలేని జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి
- మెగా డీఎస్సీపై నోరు మెదపని సర్కారు
- హామీల అమలు కోసం నిరుద్యోగుల ఎదురుచూపు
- పట్టభద్రుల ఓట్ల వేటలో కూటమి నేతల అంతర్మథనం
- ఉమ్మడి జిల్లాలో 1,08,019 గ్రాడ్యుయేట్ ఓటర్లు



సాక్షి, భీమవరం: డీఎస్సీ, గ్రూపు పరీక్షలు, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర వాటి ద్వారా ప్రభుత్వ కొలువుల కోసం ఇంటి వద్ద, జిల్లాలో, విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తదితర నగరాల్లోని కోచింగ్ సెంటర్లలో ప్రిపేర్ అవుతున్న వారు ఎందరో ఉన్నారు. వీరంతా వేలు, లక్షల్లో ఫీజులు చెల్లించి శిక్షణ తీసుకుంటున్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అయినకాడికి అప్పులు చేసి శిక్షణ ఇప్పిస్తున్నారు. బయటి ప్రాంతాల్లో ఉంటున్న వారికి హాస్టల్, మెస్ నిమిత్తం నెలకు ఆరు వేలకు పైనే ఖర్చవుతుంది. మరోపక్క డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర చదువులు చదువుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితులతో చాలీచాలనీ జీతంపై వివిధ వ్యాపార, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. వీరిలో ఎంతోమంది తమ చదువుకు తగిన ఉద్యోగం కోసం వేచి చూస్తున్నారు.

పత్తాలేని హామీలు

కూటమి ఉమ్మడి మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో నిరుద్యోగ యువతకు పెద్దపీట వేశామని చెప్పారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన చేస్తామన్నారు. అంతవరకూ నిరుద్యోగ భృతి అందజేస్తామంటూ ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి తొమ్మిది నెలలైనా వాటి ఊసెత్తకపోవడం ఆయా వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేస్తుంది. మరోపక్క తొలి సంతకం పేరిట 16 వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించినా షెడ్యూల్ విడుదల చేయకుండా విద్యాసంవత్సరం పాటు కాలయాపన చేసింది. ఇప్పుడు ఉన్న పోస్టులకు కోత పెట్టేందుకు మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఎత్తుగడ వేసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు 5.17 లక్షలు, ఏలూరు జిల్లాలో ఐదు లక్షల కుటుంబాలు ఎన్నికల వాగ్దానాల అమలుకోసం ఎదురుచూస్తున్నారు.

పెల్లుబుకుతున్న అసంతృప్తి

నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు.. అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చాక ఖజానా ఖాళీగా ఉందంటూ సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించిన విషయం విదితమే. నిరుద్యోగులకు సంబంధించిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి హామీలదీ అదే దారి. సామాజిక మాధ్యమాల ద్వారా ఇప్పటికే వివిధ వర్గాలు ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ప్రస్తుత తరుణంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కూటమి నేతలకు తలనొప్పిగా తయారయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,08,019 గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వీరిలో కొత్త పశ్చిమ గోదావరి జిల్లాలో 64,327 మంది, ఏలూరు జిల్లాలో 43,692 మంది ఉన్నారు. ఈ నెల 27న పోలింగ్ జరుగనుంది. ఎన్నికల్లో గెలుపుకోసం ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కూటమి నేతలు ఆపసోపాలు పడుతున్నారు. 2024 జూన్ నుంచే హామీలు అమలని చెప్పి ముఖం చాటేసి ఇప్పుడు ఎలా ఓట్లు అడుగుతారని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక డీఎస్సీ షెడ్యూల్ విడుదల చేస్తామంటూ కూటమి నేతల మాటలను ఎన్నికల జిమ్మిక్కుగానే కొట్టిపారేస్తున్నారు.

నిరుద్యోగ భృతి కల్పించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు నెల నెల ఇస్తానన్న భృతిని వెంటనే చెల్లించాలి, అలాగే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని ఎన్నికల ముందు లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.
– తంగెళ్ల రాధాకృష్ణ, తూర్పుతాళ్లు

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో ఆర్భాటంగా ప్రకటించడమే కాక ఎన్నికల్లో హామీ ఇచ్చారు. నేటి వరకు జాబ్ క్యాలెండర్ ఊసే లేదు. నిరుద్యోగ భృతి సైతం మరిచిపోయారు.
– సాకా సుబ్రహ్మణ్యం దేవ, బీఎస్పీ బీఈడీ

హామీ నెరవేర్చలేకపోయారు



నేను ఎంఏ చేశాను. కూటమి ప్రభుత్వం వస్తే నిరుద్యోగ భృతిగా రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచిన ఇంత వరకు ఆ ఊసే లేదు. ఎన్నికల హామీల అమలులో ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.
– అంబేద్కర్, వేల్పూరు

జాబ్ లేక వ్యవసాయం..



ఎంఏ సోషల్ చేసి జాబ్ లేక వ్యవసాయం చేస్తున్నాను. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే డీఎస్సీ ఇస్తామన్నారు, ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ఏ ఒక్క దానికి ప్రభుత్వం కట్టుబడి లేదు.
– పడవల నాని, బాలేపల్లి, ఎంఏ సోషల్

రైతులను విచారించిన అధికారులు



రైతు పోలయ్యను విచారిస్తున్న రేంజర్ విజయలక్ష్మి

సాక్షి స్పందన

నిడమర్రు: ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్‌బాబుపై రైతులు చేస్తున్న లంచాల ఆరోపణలపై నిడమర్రు సచివాలయం కార్యాలయంలో మంగళవారం అటవీ శాఖ రేంజర్ పి.మోహినీ విజయలక్ష్మి విచారణ నిర్వహించారు. 'అడిగినంత ఇస్తేనే ఆక్వా సాగు' అనే శీర్షికన ఈ నెల 14న సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. డీఎఫ్‌వో స్పందించి విచారణకు రేంజర్‌ను నియమించారు. విచారణలో జాప్యంతో విచారణ పక్కదారి పడుతోందంటూ నిడమర్రు రైతులు సాక్షిని ఆశ్రయించడంతో 'లంచాల బాగోతంపై మీనమేషాలు' అంటూ సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విచారణాధికారి నిడమర్రు వస్తున్నట్లు ఫిర్యాదుదారుడు మండా పోలయ్యకు సమాచారం అందించారు. జి రాయితీ భూముల్లో సాగు చేసుకునేందుకు ఎఫ్ఎస్‌వో తన దగ్గర రూ. 40 వేలు లంచం తీసుకున్నాడని, ఇంకా డిమాండ్ చేయడంతో వీడియోలు తీసి ఫిర్యాదు చేసినట్లు పోలయ్య లిఖిత పూర్వకంగా రేంజర్‌కు వివరాలు అందించారు. గ్రామంలో విచారణ పూర్తయ్యిందని నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

ఎన్నికల కోసం ప్రత్యేక టీంలు

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలైన్స్ టీంలు, ఎంసీసీ టీంలు, జోనల్ ఆఫీసర్లను నియమించారు. మండల స్థాయిలో ఎన్నికల నిర్వహణను ఈ బృందాలు పర్యవేక్షిస్తాయి. ఏలూరు జిల్లాలో 21 ఎఫ్ఎస్‌టీ టీంలు, 21 ఎస్ఎస్‌టీ టీంలు, 22 ఎంసీసీ టీంలు, 10 మంది జోనల్ అధికారుల్ని నియమించామన్నారు.

ఇళ్ల తొలగింపులో ఉద్రిక్తత



నిరసన చేస్తున్న పాలకోడేరు ఏఎస్ఆర్ నగర్ వాసులు

పాలకోడేరు: పాలకోడేరు శివారు ఏఎస్ఆర్ నగర్‌లో 21 కుటుంబాలు ఇళ్లు ఖాళీ చేయాలని లేదంటే తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో మంగళవారం ఉదయం నుంచి వారంతా మెయిన్ రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. చివరకు పోలీసు, పంచాయతీ, రెవెన్యూ యంత్రాంగం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ.. 21 మందికి ప్రత్యామ్నాయం చూపినట్లుగా నోటీసులు ఇచ్చి విద్యుత్తు కనెక్షన్లు కట్ చేయడం సరైన కాదని ఆరుగురు మాత్రమే ఇల్లు నిర్మించుకున్నారని మిగిలిన వారందరికీ విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించాలన్నారు. ఇల్లు నిర్మించుకున్న ఆరుగురు ఈ రోజే వెళ్ళిపోతారని తెలిపారు. రెండు నెలల్లో అందరికీ ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ఇల్లు ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ కనెక్షన్లన్నీ ఈరోజే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

ఓటు హక్కు వినియోగానికి ప్రత్యేక సెలవు

తూర్పు పశ్చిమ గోదావరి జిల్లా నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 27న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆ రోజున తూర్పు పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్ర నియోజకవర్గ పరిధిలో ఓటర్లుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యాన పంటలకు ఉపాధి నిధులు



పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో సమీక్షిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

పాలకొల్లు అర్బన్: ఉపాధి హామీ పథకం నిధులతో నూరు శాతం సబ్సిడీ అందించి ఉద్యాన పంటలు పెంచుకోవడానికి రైతులను గుర్తించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు ఆదేశాలిచ్చారు. పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో పట్టణం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల అధికారులతో మంగళవారం సమీక్షా నిర్వహించారు. నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల సాగును పెంచే దిశగా సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకుని రైతులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో నూరుశాతం సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన సన్న, చిన్నకారు రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఒక్కొక్క రైతుకు నూరుశాతం సబ్సిడీ అందజేస్తారన్నారు. మూడేళ్ల కాలానికి అత్యల్పంగా మునగ సాగుకు రూ.27,515, దానిమ్మ సాగుకు ఎకరానికి రూ.2,16,417 అందజేస్తారన్నారు. ఉద్యాన పంటల సాగుకు రైతులను గుర్తించి జాబితాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ డా.కేసీహెచ్ అప్పారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.దేవేంద్రకుమార్, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమన్వయంతో పనిచేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సంబంధిత అధికారులు, బ్యాంకర్ల సమన్వయంతో పనిచేసి మంచి ప్రగతి సాధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో సూర్య ఘర్ యోజన పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 13,202 దరఖాస్తులు రిజిస్టర్ కాగా కేవలం 633 గృహాలకు మాత్రమే సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారన్నారు. ఈ పథకం అమలు సంతృప్తికరంగా లేదన్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటుపై అవగాహన కల్పిస్తే పెద్ద ఎత్తున ప్రజలు ముందుకు వచ్చి ఏర్పాటుకు సంసిద్ధంగా ఉంటారన్నారు. పథకం ప్రారంభించి సంవత్సరం పూర్తయిన పూర్తిస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించడంలో వెనుకబాటు కనిపిస్తుందన్నారు.

పెద్దింట్లమ్మ జాతరను విజయవంతం చేద్దాం



సమావేశంలో ఆర్డీవో అంబరీష్ తదితరులు

కై కలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీవో, జాతర నిర్వాహణ చైర్మన్ డాక్టర్ అచ్యుత అంబరీష్ చెప్పారు. మార్చి 1 నుంచి 13 వరకు జరిగే జాతర(తీర్థం) నిమిత్తం కొల్లేటికోట దేవస్థానం వద్ద రెండో విడత వివిధ శాఖల అధికారుల సమన్వయ సమావేశం మంగళవారం జరిగింది. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ జాతర సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో అందరూ పనిచేయాలన్నారు. జాతర అన్ని రోజులు పారిశుద్ధ్య కార్మికులతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ చెప్పారు. ముందుగా జాతర గోడపత్రి, బుక్‌లెట్, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ. ఇబ్రహీం, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఆర్.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ పంజా

- ఇంతవరకు 15 లక్షల లేయర్ కోళ్ల మృత్యువాత
- సుమారు రూ.70 కోట్లకు పైగా పౌల్ట్రీలకు నష్టం
- జిల్లా వ్యాప్తంగా ఇన్ఫెక్షన్ జోన్ల గుర్తింపు
- రెడ్ జోన్ పరిధిలోని పౌల్ట్రీలు మూడు నెలల పాటు మూసివేత
- మూడు రోజులుగా కొనసాగుతున్న శానిటేషన్ ప్రక్రియ



ఉంగుటూరు మండలం బాదంపూడిలో కోడి గుడ్లను పూడ్చిపెడుతున్న దృశ్యం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ విజృంభన కొనసాగుతోంది. బర్డ్‌ఫ్లూతో ఇప్పటికే లక్షల సంఖ్యలో చనిపోయాయి. దాదాపు 19 ఏళ్ళ తరువాత జిల్లాలో బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ రంగం తీవ్ర సంక్షోభంలోకి జారుకుంది. సంక్రాంతి ముందు నుంచే వైరస్ లక్షణాలతో కోళ్ళు చనిపోతుండగా శీతల ప్రభావమంటూ అధికారులు కొట్టిపడేశారు. ఒక్కసారిగా గత వారం పది రోజుల నుంచి బర్డ్‌ఫ్లూ పంజా విసరడంతో సుమారు 15 లక్షల వరకు లేయర్ కోళ్ళు, 50 వేల వరకు బ్రాయిలర్ కోళ్ళు చనిపోయినట్టు అంచనా. కోళ్ళ మేత, గుడ్లు, అన్నింటి విలువ కలుపుకొని సుమారు రూ. 70 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పౌల్ట్రీ రంగం గణనీయంగా విస్తరించింది. జిల్లాలో సుమారు 200 పౌల్ట్రీలు ఉండగా వాటిలో 2.20 కోట్ల లేయర్ కోళ్లు ఉన్నాయి. ప్రస్తుతం సగటున ప్రతిరోజూ 1.30 కోట్ల కోళ్ల ద్వారా 1.10 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. ప్రధానంగా ఒడిశా, బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలకు 70 శాతం గుడ్ల ఎగుమతులు జరుగుతుండగా, మిగిలిన 30 శాతం గుడ్లు స్థానిక అవసరాలకు వినియోగిస్తున్నారు.

2006లో 50 పైసలకు పడిపోయిన గుడ్డు ధర

2006లో జిల్లాలో మొట్టమొదటిసారిగా పౌల్ట్రీల్లో బర్డ్‌ఫ్లూను గుర్తించారు. అప్పట్లో జిల్లాలో లక్షల సంఖ్యలో కోళ్ళు చనిపోయాయి. రూ.1.90 ఉన్న గుడ్డు ధర 50 పైసలకు పడిపోవడంతో పౌల్ట్రీలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ఈ క్రమంలో వ్యాక్సినేషన్లు, ఇతర జాగ్రత్తల ద్వారా వైరస్‌లను అధిగమిస్తూ రెండేళ్ళలోనే పౌల్ట్రీల వ్యవస్థను గాడిలో పెట్టారు. 19 ఏళ్ళ తరువాత జిల్లాలో వైరస్‌ను గుర్తించడం, అది కూడా లక్షల సంఖ్యలో కోళ్ళు చనిపోయాక గుర్తించడం గమనార్హం. వ్యాక్సినేషన్ ప్రక్రియ సరిగ్గా చేయకపోవడం వల్లే వైరస్ వ్యాప్తి చెందిందనేది పౌల్ట్రీ వర్గాల భావన. జిల్లాలో ఉంగుటూరు, బాదంపూడి, తణుకు రూరల్, వేల్పూరు, పెరవలి, తాడేపల్లిగూడెంతో పాటు అనేక ప్రాంతాల్లో కోళ్ళ ఫారాలున్నాయి.

11న జిల్లాలో వైరస్ గుర్తింపు

ఈ నెల 11న జిల్లాలో వైరస్‌ను గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో బాదంపూడిలోని పౌల్ట్రీలో రోజుకు 3 నుంచి 4 వేల కోళ్లు చనిపోవడం గుర్తించారు. అధికార యంత్రాంగం వారం రోజుల తరువాత అలెర్ట్ అయింది. వాస్తవానికి ప్రతి రోజూ పౌల్ట్రీల్లో సాధారణ పరిస్థితులను బట్టి లక్షల కోళ్ళు ఉన్నచోట 30 నుంచి 50 కోళ్లు చనిపోతుంటాయి. బాదంపూడి, వేల్పూరు, తణుకు రూరల్‌లో ఎక్కువగా కోళ్లు చనిపోవడంతో వాటిని ల్యాబ్‌కు పంపగా ఏవియాన్ ఇన్‌ఫ్లుయాంజ్ (హెచ్ 5ఎన్–1) వైరస్‌గా గుర్తించారు.

లక్షల కోళ్లు, గుడ్లు పూడ్చివేత

జిల్లా వ్యాప్తంగా 15 లక్షల ఫారం కోళ్లు, 50 వేల బ్రాయిలర్ కోళ్లు వైరస్‌తో చనిపోయాయని పౌల్ట్రీ వర్గాల అంచనా. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖాధికారులు వైరస్ గుర్తించిన పౌల్ట్రీలకు 10 కిలోమీటర్ల దూరం వరకు అలెర్ట్ జోన్లుగా ప్రకటించి చికెన్, గుడ్ల విక్రయాలను నిషేధించారు. వైరస్ ఉన్న కోళ్ళ ఫారాల ప్రాంతాలను ఇన్ఫెక్షన్ జోన్లుగా ప్రకటించి వెటర్నరీ వైద్యులతో 25 బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో 1.24 లక్షల కోళ్ళు, 1.85 లక్షల కోళ్ళ మేతలు, లక్షకు పైగా గుడ్లను భూమిలో పూడ్చివేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2 పౌల్ట్రీల్లో 22 వేల కోళ్ళు, 24,660 గుడ్లు, 20 కిలోల మేతను పూడ్చివేశారు.

తాబేళ్ల రక్షణకు ప్రత్యేక చర్యలు

- తాబేళ్ల గుడ్ల సంరక్షణకు హేచరీ ఏర్పాటు
- మడ అడవులను పరిశీలించిన పశ్చిమ కలెక్టర్
- తీరప్రాంత గ్రామాల్లో కలెక్టర్ నాగరాణి పర్యటన


తాబేళ్ల గుడ్ల సంరక్షణ పునరుత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి


దర్బరేవులో బోటుపై నుంచి మడ చెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

నరసాపురం రూరల్: సముద్ర పర్యావరణ సమతుల్యతను పరిరక్షించేందుకు తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం నరసాపురం మండలం సముద్ర తీర ప్రాంతమైన చినమైనవానిలంక గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాబేళ్ల గుడ్ల సేకరణ, సంరక్షణ, పునరుత్పత్తి కేంద్రాన్ని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలసి ఆమె పరిశీలించారు. అటవీశాఖ అధికారులను గుడ్ల సంరక్షణకు చేపట్టిన ప్రత్యేక చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సముద్ర వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా సముద్రజీవులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. గత నెలలో పదుల సంఖ్యలో తాబేళ్లు చనిపోయి సముద్రతీర ప్రాంతానికి కొట్టుకురావడం చాలా బాధ కలిగించిందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో సమావేశమై తాబేళ్లు చనిపోవడానికి గల కారణాలను విశ్లేషించేందుకు పోస్టుమార్టం చేయించామన్నారు. ఆ నివేదక ఇంకా అందాల్సి ఉందన్నారు. తదుపరి చర్యల్లో బాగంగా అటవీశాఖ పర్యవేక్షణలో తాబేళ్లు వచ్చి గుడ్లు పెట్టే ప్రాంతాలను గుర్తించి వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకూ తాబేళ్లు సముద్రపు ఒడ్డున అనువైన ప్రాంతంలో గుడ్లు పెట్టే సమయం అని, అనంతరం ఆ గుడ్లనుంచి పిల్లలు బయటకు వస్తాయన్నారు. ఆలీవ్‌రెడ్లీ జాతి తాబేళ్లు పెట్టిన సుమారు 4,400 గుడ్లను హేచరీలో ఉంచామని, రానున్న రెండు నెలల కాలంలో మరో 25 వేల గుడ్లు పెట్టే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. గుడ్ల నుంచి పిల్లలు బయటకు వచ్చిన అనంతరం వాటిని సముద్రంలోని విడచి పెట్టే కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తామన్నారు. తద్వారా సముద్ర జీవుల పట్ల అవగాహన కలుగుతుందన్నారు. తాబేళ్లు ఒడ్డుకు వచ్చి గుడ్లు పెట్టేందుకు అనువుగా సముద్రం అంచున వలలను అడ్డంకిగా లేకుండా చూడాలని మత్స్యకారులకు సూచించారు. మానవ మనుగడకు సముద్ర వాతావరణం సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మడ అడవులను నరికితే చర్యలు

చినమైనవానిలంకలో తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం కలెక్టర్ నాగరాణి దర్బరేవు, రాజుల్లంక ప్రాంతాల్లోని మడ అడవులను బోటులో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మడ అడవులను పెరగనివ్వాలని, వాటిని అక్రమంగా నరికితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సముద్రతీర ప్రాంతం కోతకు గురికాకుండా మడ అడవులు రక్షణగా నిలుస్తాయన్నారు. ఇప్పటికే సముద్రం పెదమైనవానిలంక, చినమైనవానిలంక ప్రాంతాల్లో ముందుకు చొచ్చుకుని వచ్చిన విషయం తెలిసిందన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవానిలంక గ్రామంలో ఒక కిలోమీటర్ మేర నిర్మించనున్న సముద్ర రక్షణ గోడకు రూ.35 కోట్లు వ్యయం అవుతుందని ఈ నిధులను మంత్రి కేటాయించారన్నారు. పనులను ఎలైట్ కంపెనీ త్వరలో ప్రారంభిస్తుందన్నారు. వాస్తవంగా ఏడు కిలోమీటర్ల మేర ఈ రక్షణ గోడను నిర్మించాల్సి ఉందని ప్రస్తుతం ఒక కిలోమీటరు మాత్రమే ఈ గోడను నిర్మిస్తారన్నారు. చినమైనవానిలంకలోని నల్లీక్రీక్‌పై వంతెనను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. వంతెన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి ఆశాకిరణ్, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ శ్రీవేద, నరసాపురం తహసీల్దార్ రాజరాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పోక్సో కేసులో 8 ఏళ్ల జైలు

ఇరగవరం: పోక్సో కేసులో ముద్దాయికి 8 ఏళ్ల జైలు శిక్ష, రూ.60 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం భీమవరం పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్సై జానా సతీష్ తెలిపిన వివరాలివి. గొల్లమాలపల్లికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన తోట నరేష్ (27) లైంగికంగా వేధించేవాడు. అడ్డుపడిన వారిని సైతం చంపుతానని బెదిరించడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా 2022 జనవరి 27వ ఎస్సై జానా సతీష్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టు విచారణలో నేరం నిర్ధారణ కావడంతో ముద్దాయి నరేష్‌కు భీమవరం పోక్సో కోర్టు జడ్జి బి లక్ష్మీనారాయణ ఎనిమిదేళ్ల జైలు, రూ.60 వేలు జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి బ్రహ్మయ్య వాదనలు వినిపించగా హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు సహకరించారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నూజివీడు: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.12 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్‌కుమార్ 2020 ఆగస్టు 2న జంగారెడ్డిగూడెంకు చెందిన ఎర్నెస్ట్ కుమార్‌కు రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ తీర్చమని అడుగగా ఎర్నెస్ట్ కుమార్ 2020 డిసెంబర్ 27న ప్రవీణ్‌కుమార్‌కు ఒకొక్కటి రూ.5లక్షలు చొప్పున రెండు చెక్కులను ఇచ్చారు. ఆ చెక్కులను నగదు నిమిత్తం బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేదని వెనక్కు తిరిగి వచ్చాయి. దీంతో ప్రవీణ్‌కుమార్ కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం ఎర్నెస్ట్ కుమార్‌కు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

క్లుప్తంగా

గ్రామ బహిష్కరణపై ఫిర్యాదు

మండవల్లి: తనకు గ్రామ బహిష్కరణ లేకుండా రక్షణ కల్పించాలని ఓ గొర్రెల పెంపకందారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వాడలంక గ్రామవాసి త్రిమూర్తులు గొర్రెల పెంపకందారుడు. గొర్రెల పెంపకం వలన గ్రామ వాతావరణం కాలుష్యమౌతుందంటూ గ్రామం నుంచి బహిష్కరిస్తామని సర్పంచ్‌తోపాటు స్థానిక పెద్దలు గ్రామ సభ ద్వారా హెచ్చరికలు జారీ చేశారని త్రిమూర్తులు మంగళవారం మండవల్లిలో పేర్కొన్నాడు. గ్రామసభ ఏర్పాటు చేసి, గొర్రెలను స్వాధీనం చేసుకుని కఠినమైన చర్యలు తీసుకుంటామని గ్రామ చావడి మైక్ ద్వారా తెలియజేశారన్నాడు. తనకు గ్రామ బహిష్కరణ లేకుండా రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఐటీఐలో ఉచిత కంప్యూటర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీ ఎస్ఎస్‌డీసీ వారి ఆధ్వర్యంలో 45 రోజుల కంప్యూటర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలో ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసరాజు మంగళవారం తెలిపారు. పదో తరగతి ఆపైన పాస్ అయ్యి ఉండాలని, 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తోపాటు ఉద్యోగ అవకాశం కల్పించబడుతుందన్నారు. వివరాలకు 94928 85556, 08816 297093 నంబర్లలో సంప్రదించాలన్నారు.

యువతి ఆత్మహత్య

నరసాపురం రూరల్: కొప్పర్రు గ్రామానికి చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని పంటకాలువ సమీపంలో ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటున్న ఎరిచర్ల సిరి అనే యువతి సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు చందు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అయితే ఈ సమాచారంపై పోలీసులను సంప్రదించగా వారు స్పందించలేదు.

బంగారు, వెండి ఆభరణాలతో నవ వధువు పరారీ

ఏలూరు (టూటౌన్): నవ వధువు బంగారం, వెండి ఆభరణాలు పట్టుకుని పరారైన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం ఏలూరు గజ్జల వారి చెరువు సమీపంలో వి.శివ నాగ సాయి కృష్ణ జ్యూస్ దుకాణాన్ని నిర్వహిస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. గత నెల 31వ తేదీన అతనికి విశాఖపట్టణం కంచరపాలెం ప్రాంతానికి చెందిన బోడేపు చంద్ర హాసినితో వివాహమైంది. అత్తవారింటి నుంచి ఏడు రోజుల క్రితం ఏలూరు నగరానికి చేరుకున్న కొత్తజంట కొత్త కాపురాన్ని బిట్టుబారు సమీపంలో ఉన్న అద్దె ఇంట్లో మొదలుపెట్టారు. అయితే ఈ నెల 16వ తేదీన భార్యాభర్తలు ఇద్దరు నిద్రకు ఉపక్రమించగా, 17వ తేదీన శివ నిద్రలేచి చూసేసరికి నవవధువు ఇంటి నుంచి పరారైనట్లు గుర్తించాడు. ఆమె వెళ్తూవెళ్తూ నాలుగు కాసుల బంగారు గొలుసు, ఉంగరం, వెండి పట్టీలు సెల్‌ఫోన్‌తో పరారైనట్లు శివ గుర్తించాడు. ఆమె ఆచూకీ కోసం ఆమె తండ్రితో కలిసి వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చంపింది ప్రియురాలి భర్త, మామలే!

- కొలిక్కివచ్చిన మజ్జి ఏసు హత్య కేసు
- పోలీసుల అదుపులో నిందితులు!
- హత్యకు సహకరించిన మరోవ్యక్తి కోసం పోలీసుల గాలింపు

నిడమర్రు: బావాయిపాలెంలో సంచలనం రేకెత్తించిన మజ్జి ఏసు హత్య కేసు కొలిక్కివచ్చినట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధమే ఈ హత్యకు ప్రధాన కారణంగా ఉంది. నిందితులు ఏసు ప్రియురాలి భర్త, మామలే.. వారు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ హత్యకు సహకరించిన ఉండి మండలంకు చెందిన మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పోలీసుల విచారణలో...

బావాయిపాలెంలో ఏసు రాజు ఇంటి సమీపంలో ఉంటున్న ఒక మహిళతో వివాహేతర సంబంధమే సాగించడమే ఈ హత్యకు కారణంగా చెబుతున్నారు. హత్య జరిగిన రోజు పోలీసు జాగిలాలు సదరు మహిళ ఇంటి వద్దనే తిరగడంతోపాటు.. ఆ ఇంటికి చెందిన తండ్రి, కొడుకులు (పిల్లి అన్నవరం , పిల్లి ఏసు) ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంతో పోలీసులు ఆదిశగా విచారణ ప్రారంభించారు. ఈ వివాహేతర సంబంధం తెలిసి ఏడాదిగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పంచాయతీ పెద్దల వరకు గొడవ వెళ్లగా వారు సర్దిచెప్పినట్లు తెలిసింది.

పథకం ప్రకారం హత్య

నిందుతులుగా భావిస్తున్న తండ్రి కొడుకులు పిల్లి అన్నవరం, పిల్లి ఏసు పథకం ప్రకారం మజ్జి ఏసును హత్య చేసినట్లు తెలిసింది. ఈనెల 15వ తేదీ రాత్రి బావాయిపాలెం గ్రామంలో కాపవరం కాలువ గట్టు వద్దకు ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉండగా తండ్రి, కొడుకులు కలిసి దాడి చేసి పదునైన కత్తితో మృతుడు ఏసురాజు కుడి చెయ్యి నరికేశారు. ఆ తర్వాత పీక నొక్కి చంపేసినట్లు సమాచారం. నరికిన చెయ్యిని కాపవరం కాలువలో విసిరేశారు. ఈ తతంగంలో మూడో వ్యక్తి ఉన్నట్లు తెలిసింది. కనిపించకుండా పోయిన మృతుడి కుడి చెయ్యి భాగాన్ని పోలీసులు కాపవరం కాలువలో గుర్తించి సేకరించారు. అయితే మృతుడు ఏసు రాజు పలువురు మహిళలతో వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితులైన తండ్రి, కొడుకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని, వీరికి సహకరించిన మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

దివ్యం.. శేష సాయి దర్శనం


బాబా ఫొటోపై ఉన్న పాము


ఆలయం నుంచి బయటకు వెళుతున్న పాము

స్థానిక సాయిబాబా ఆలయంలో మంగళవారం రాత్రి బాబా విగ్రహంపై ఒక తాచు పాము దర్శనమిచ్చింది. ఆలయంలోకి ప్రవేశించిన ఈ పాము బాబా శిరస్సుపై ఉండటం ఆలయ నిర్వాహకుడు పుష్పాల మురళీకి కనిపించింది. విషయం తెలుసుకున్న భక్తులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకోవడంతో, పాము నెమ్మదిగా బాబా విగ్రహం నుంచి ఫొటో మీదకు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయింది.

– ద్వారకాతిరుమల

ఉపాధి కూలీలను ఢీకొన్న ట్రాక్టర్

ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై (ఇన్‌సెట్‌లో మృతురాలు భాగ్యవతి)

కొయ్యలగూడెం: ఉపాధి పనుల కోసం వెళుతున్న కూలీలను ట్రాక్టర్ ఢీకొన్న ఘటన కుంతలగూడెం సమీపంలో మంగళవారం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం కుంతలగూడెంకు చెందిన కొందరు కూలీలు మంగళవారం ఉపాధి పనుల కోసం వెళ్తున్నారు. ఆ సమయంలో చిన్నాయగూడెం వైపు వెళుతున్న ట్రాక్టర్ అతి వేగంగా వచ్చి కూలీలను ఢీకొంది. ఈ ప్రమాదంలో అల్లె భాగ్యవతి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈమెతో పాటుగా మరో ముగ్గురు కూలీలు రాపాక నాగమణి, చాపల ఇమ్మెలియా, బాసుబోయిన పోసమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మెరుగైన వైద్యం నిమిత్తం తరలించినట్లు ఏపీవో నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో ఇమ్మెలియా పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు 108 టెక్నీషియన్ బద్రి పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్త వలనే ప్రమాదం సంభవించిందని కూలీలు ఆరోపించారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనా స్థలానికి ఎస్సై వి.చంద్రశేఖర్ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలే కారణమా!

- గోస్తనీ కాలువలో దూకి ఆదివారం మహిళ ఆత్మహత్య
- సోమవారం కాలువలో లభ్యమైన మృతదేహం
- విలపిస్తున్న కుటుంబసభ్యులు


ఆసుపత్రిలోని మార్చురీలో శాంతి మృతదేహం


నాడు, నేడుగా తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో శాంతి పోస్టు చేసిన ఫొటో

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురంలో నివసించే గుమ్మళ్ల శాంతి (48) మంగళవారం ఆంధ్రా సుగర్స్ ప్రాంతంలోని కాలువలో శవమై తేలింది. ఆమె ఆదివారం రాత్రి 2.30 గంటలకు ఇంటి నుంచి బయటకు రావడం, సోమవారం ఉదయం గోస్తనీ కాలువ జాతీయరహదారి వంతెనపై ఆమె బూట్లు కనిపించడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని నిర్ధారణకు రావడంతో పోలీసులు, అగ్నిమాపక అధికారులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి ఆమె మృతదేహం ఆంధ్రా సుగర్స్ ప్రాంతంలో లభ్యమైంది. ఇటీవల కుటుంబ కలహాలతో కొన్ని మనస్పర్ధలు ఏర్పడ్డాయని అందుకే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోందని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి పోలీసుల పంచనామా అనంతరం పోస్టుమార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుటుంబమంతా వెల్‌నెస్‌పైనే ఉపాధి

శాంతి కుటుంబమంతా వెల్‌నెస్ సెంటర్‌లపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. వృద్ధులైన తన తల్లిదండ్రులతోపాటు ఇద్దరు కుమారులతో సజ్జాపురం పార్కు ప్రాంతంలో శాంతి నివసిస్తోంది. పెద్దకుమారుడు దుర్గాప్రసాద్ వివాహానంతరం కాకినాడలో వెల్‌నెస్ సెంటర్ నడుపుతూ అక్కడే నివసిస్తుండగా, చిన్న కుమారుడు పవన్ తణుకు బొమ్మల వీధిలో వెల్‌నెస్ సెంటర్ కోచ్‌గా ఉన్నారు. అయితే గతంలో స్థూలకాయంతో ఉండే శాంతి వెల్‌నెస్ సెంటర్‌లో వాడిన మందులతో సన్నబడి ఎంతో హుషారుగా ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. తను మారిన విధానాన్ని అందరికీ తెలిసేలా ఫొటోలు, వీడియోలను సైతం సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసేవారని, తన కుటుంబంతో కూడా ఎంతో సంతోషంగా గడిపేవారని, కుమారులిద్దరితో కలిసి దిగిన ఫొటోలను షేర్ చేసేవారని అటువంటి ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందోనని స్థానిక ప్రజానీకం చర్చించుకుంటున్నారు. గోస్తనీ కాలువలో ఆమె శవమై తేలడాన్ని కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోయారు. ఆమె విగతజీవిగా కనిపించడంతో కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

రక్తదానమే లక్ష్యంగా.. హోప్ పయనం


తలసేమియా చిన్నారులతో హోప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు


రక్తదానం చేస్తున్న హోప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

- ఏపీ, తెలంగాణలో 25 బ్లడ్ బ్యాంకులకు రక్తదానం
- వాట్సాప్‌లో 200 మంది సభ్యుల చేరిక
- 52 మంది తలసేమియా చిన్నారులకు ప్రతినెలా రక్తదానం
- రెండు తెలుగు రాష్ట్రాల్లో 15 వేల మందికి రక్తదానం

కైకలూరు: నిండు ప్రాణాలను కాపాడటంలో కలిగే సంతోషం ఎన్ని లక్షలు పెట్టినా రాదు. ఇదే నినాదంతో 2022లో ఏర్పాటైన హోప్ చారిటబుల్ ట్రస్ట్ సేవలందిస్తోంది. కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం పడమటిపాలెం గ్రామానికి చెందిన అల్లాడి రవితేజ స్నేహితులతో కలసి ఓ వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశాడు. ఒక్క అడుగుతో మొదలైన సేవా ప్రస్థానం ఇప్పుడు ఏకంగా 200 మంది సభ్యులకు చేరింది. రక్తదానమే పరమావధిగా సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 25 ప్రముఖ బ్లడ్ బ్యాంకులలో రక్తాన్ని అందించే స్థాయికి చేరింది. ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలు, గర్భిణీలు, క్యాన్సర్ పేషెంట్లు, తలసేమియా చిన్నారులు, అత్యవసర చికిత్సలు ఇలా 16,700 యూనిట్ల రక్తదానం సభ్యులు చేశారు. సేవే పరమార్థంగా పనిచేస్తున్న సభ్యులను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

తలసేమియా చిన్నారులకు దేవుళ్లు

తలసేమియా చిన్నారులకు ప్రతి 21 రోజులకు రక్తమార్పిడి జరగాలి. వీరి ఇబ్బందులను గుర్తించిన సంస్థ సభ్యులు భీమవరం, ఉండి, కైకలూరు, కలిదిండి, పాలకొల్లు, నరసాపురం , తణుకు ఇలా అనేక ప్రాంతాల్లో జల్లెడ పట్టి మొత్తం 52 మంది చిన్నారులను గుర్తించారు. వీరి కోసం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆనంద్ బ్లడ్ బ్యాంకులో వివిధ గ్రూపుల రక్తాన్ని నిల్వ చేస్తున్నారు. చిన్నారులకు అమృత హాస్పటల్‌లో రూ.1000 ఖరీదు కలిగిన రక్తం ఎక్కించే ఫిల్టర్లను సైతం వీరే అందిస్తున్నారు. మహాత్మా గాంధీ, అబ్దుల్ కలాం, అంబేద్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావుల వర్ధంతి, చిరంజీవి, పవన్ కల్యాణ్, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజులు ఇలా పలు సందర్భాల్లో రక్తదానం సేకరించి ప్రమాదంలో ప్రజలకు సంస్థ సభ్యులు సేవ చేస్తున్నారు.

స్నేహితుల సహకారం మరువను



రక్తం అందక నిండు గర్భిణీ మరణం నన్ను కలచివేసింది. సమాజానికి మేలు చేయాలని అప్పుడే భావించాను. నాకు స్నేహితులందరూ అండగా నిలిచారు. ఆపదలో ఉన్న వారికి మేము ఉన్నాం.. అనే చిన్న భరోసా కల్పించడానికి ఏర్పాటు చేసిన ఈ సంస్థలో ఇప్పుడు ఇంత మంది తోడుగా రావడం సంతోషం. మరిన్నీ సేవా కార్యక్రమాలు చేస్తాం.

– అల్లాడి రవితేజ, సంస్థ ఫౌండర్, ఆడిటర్, హైదరాబాద్

సేవే లక్ష్యంగా పనిచేస్తున్నాం



సేవే పరమార్థంగా అందరం పనిచేస్తున్నాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో సభ్యులందరూ సకాలంలో స్పందిస్తున్నారు. శనివారం భీమవరంలో మహిళకు రక్తం అవసరమయ్యింది. అర్ధరాత్రి 2 గంటలకు వెళ్లి ఆమెకు రక్తదానం చేశాను. ఇలా అందరూ సభ్యులు చేస్తున్నారు. అపోహలు విడనాడి అందరూ రక్తదానానికి ముందుకు రావాలి.

– ఉండి రాజశేఖరరెడ్డి, సభ్యుడు, మూలలంక, కలిదిండి మండలం

విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి

ఆకివీడు: విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఎస్సై హనుమంతు నాగరాజు తెలిపిన వివరాలివి. మంగళవారం స్థానిక గుంటూరు సెంటర్‌లోని ఖాళీ ప్రదేశంలో ఓ టెంట్ వద్ద సత్తినీనీడి ధనరాజు, మణికంఠ, తోట అయ్యప్ప గుమికూడి ఉన్నారు. దీనిపై 100కు వచ్చిన ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ శివ అక్కడికి వెళ్లి వారిని వెళ్లిపోవాలని ఆదేశించారు. అనంతరం శివ మరో కానిస్టేబుల్ కోటేశ్వరరావుతో సాయంత్రం డ్యూటీకి వెళుతుండగా అదే ప్రాంతంలోని బ్రాందీ షాపు వద్ద కాపు కాసి కానిస్టేబుల్ శివపై మణికంఠ, ధనరాజు, అయ్యప్ప దాడికి పాల్పడ్డారు. స్థానికులు అడ్డుకుని గొడవను నిలుపుదల చేశారు. కానిస్టేబుల్ శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



మంచిలిలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో పి శామ్యూల్

అత్తిలి: ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి శామ్యూల్ అన్నారు. అత్తిలి మండలం మంచిలి గ్రామ సచివాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆ. ధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఐదేళ్ల లోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్, మార్పులు, మొబైల్ నంబర్‌లు లింకు చేసుకోవడం వంటి కార్యక్రమాలు ఈక్యాంపులో అందుబాటులో ఉంచామన్నారు.

ఆత్మ బంధువులు సేవా సంఘం సేవలు అభినందనీయం



దివ్యాంగుల పిల్లలకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆత్మ బంధువులు సేవా సంఘం (ఏబీఎఫ్) సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సంఘం ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల విద్యార్థులకు వివిధ సేవలను అందించారు. ఏబీఎఫ్ సంఘ సభ్యులు వెజ్జు దుర్గా ప్రసాద్, పరశురామయ్య, జగదీష్, ఫౌండర్ అండ్ సెక్రటరీ శీతాల ఉషా కిరణి, ఇంద్రవాణి పాల్గొని విద్యార్థులకు అవసరమైనటువంటి విద్య, క్రీడా సామగ్రిని అందజేశారు. సంఘం తరుపున భవిత విద్యార్థులకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు తప్పక ఉంటాయని చెప్పారు. హెచ్‌ఎం బి.జ్యోతి, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

వీర రాఘవులును గెలిపించండి



రాఘవులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దిడ్ల వీర రాఘవులను గెలిపించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజా ఉద్యమాలకు అండగా ఉండే అభ్యర్థి, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసే అభ్యర్థిని మాత్రమే ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ప్రత్తి వీరాస్వామి, నాయకులు ప్రతివాద నాగేంద్ర, శివాజీ, నర్మాల నారాయణరావులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

27 మందికి ఉచిత వైద్య సేవలు



తణుకులో వైద్యశిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 27 మంది వృద్ధులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్ర బాబు హాజరైన వృద్ధులకు వైద్యసేవలందించి మంచి ఆహార అలవాట్లు, నడక, వ్యాయామం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్. అగ్రహారం గ్రామంలో మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి ఏడు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బోసిపోతున్న సచివాలయాలు

- కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- సర్వేల పేరుతో సిబ్బందిని వేర్వేరు పనులకు కేటాయింపు
- ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్న ప్రజలు



అలంపురం సచివాలయం మూసి వేసి పలకపై సర్వేలకు వెళ్లినట్లు బోర్డు పెట్టిన దృశ్యం

పెంటపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలు సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. సచివాలయాల్లో ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి సేవలు అందడం లేదు. గత ప్రభుత్వంలో సచివాలయాలకు మెయింటెన్స్ కింద ఇచ్చే గ్రాంట్‌ను నిలిపివేసింది. చాలా సచివాలయాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి కంప్యూటర్లు మూలనపడ్డాయి. సచివాలయ సిబ్బందిని కావాలనే వేరే పనులకు వాడుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రజలు, సచివాలయ సిబ్బందికి మధ్య వారధిలో పనిచేసి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ సచివాలయాల్లో 545 రకాల సేవలను ప్రజలకు అందించేవారు. దీంతో మండల కార్యాలయాలతో పనే లేకుండా చేశారు. అయితే గత ప్రభుత్వానికి పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తూ వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. సచివాలయ వ్యవస్థను కూడా రద్దు చేసే ప్రయత్నాలు చేస్తూ సచివాలయాల్లో సిబ్బందిని లేకుండా చేస్తున్నారు.

గూడెం నియోజకవర్గంలో సుమారు 650మంది ఉద్యోగులు

గూడెం నియోజకవర్గంలో 67 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 600మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో పరిపాలన, విద్యా, సంక్షేమం, ప్లానింగ్, నీటి సరఫరా, మహిళా పోలీస్, పారిశుద్ధ్యం, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం తదితర విభాగాలతో గ్రామ పరిపాలనా విభాగం పనిచేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. 2014–19 పరిపాలనలో పడిన అవస్థలను ప్రజలకు మళ్లీ పరిచయం చేస్తున్నారు. ప్రస్తుతం ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు దాపురించాయి. సచివాలయ వ్యవస్థను పట్టించుకోకుండా అందులో పనిచేస్తున్న సిబ్బందిని వివిధ రకాలైన రిసర్వేలు పింఛన్ల పంపిణీకి ఉపయోగించడంతో సచివాలయాలు బోసిపోతున్నాయి. రేషన్‌కార్డుల్లో పేర్ల మార్పు, తీసి వేయడం, పొలం వన్‌బీ, అడంగల్, పొలాన్ని ఆన్‌లైన్ చేయడం, ఇతర ప్రధాన సేవల కోసం రెవెన్యూ కార్యాలయ చుట్టూ రోజుల తరబడి తిరిగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో?



భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అయినా పరిష్కారం కావడం లేదు. గతంలో సచివాలయాల్లో వీఆర్‌ఓ గ్రామంలో అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీఆర్‌ఓ మండల కేంద్రంలో కూర్చుంటున్నారు. అడంగల్, వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వస్తోంది. సచివాలయంలో పలకరించే నాథుడు లేకుండా పోయారు. ప్రజలు సచివాలయాల దగ్గరకు చెప్పులు అరిగేలా తిరుగుతున్నా పనులు కావడం లేదు. ఫలానా అధికారి కోసం వస్తే ఆ అధికారి సర్వేకు వెళ్లాడని ఇతర అధికారులు చెబుతున్నారు. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు తికమకపడుతున్నారు.

– పాలా గణపతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు, బి. కొండేపాడు

ఇబ్బందులు పడుతున్నాం...



గతంలో ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా గ్రామస్థాయిలోనే పనులు పూర్తయ్యేవి. ప్రస్తుతం సచివాలయంలో పనులు జరగడం లేదు. పని జరగాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామం మండల కేంద్రానికి 10కిలో మీటర్ల దూరంలో ఉంది. ఒక పనిమీద మండల కేంద్రానికి వెళ్లాలంటే ఆరోజు మొత్తం ఆ పని కోసమే కేటాయించాలి. పని జరగక పోతే మళ్లీ మరుసటి రోజు రావాలి. గత ప్రభుత్వం గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించి గ్రామ స్వరాజ్యాన్ని చూపించింది. ఇప్పుడెమో వలంటీర్ వ్యవస్థను లేకుండా చేసే సచివాలయ సిబ్బందిని ఇతర పనులకు వాడుకుంటున్నారు. బాధితులు ఏదైనా పనుల నిమిత్తం వస్తే కనీసం పలికేవారు లేకుండా పోయారు. గతంలో ఏదైనా పని ఉంటే వలంటీర్‌కు చెబితే చాలు. అన్నీ వారే చూసుకొని పని చేసి పెట్టే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– దేవరశెట్టి రాంబాబు, రైతు

ఉచిత మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



తణుకు బార్ అసోసియేషన్ భవనంలో డాక్టర్ గుణరంజన్‌ను సత్కరించిన కామేష్, న్యాయవాదులు

తణుకు అర్బన్: న్యాయవాదుల సౌకర్యార్థమే మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. మంగళవారం తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లివర్ అండ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యలపై న్యాయవాదులకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సుమారు 150 మంది న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకున్నారని చెప్పారు. రూ. 3500 విలువైన ఫైబ్రో స్కాన్ పరీక్షలతోపాటు ఎఫ్ఎల్‌టి రక్త పరీక్షల్ని విరాజ్ క్యాస్ట్రో ఎంట్రాలజీ నిర్వహించారని చెప్పారు. ఈ సందర్భంగా వైద్యసేవలందించిన డాక్టర్ జె. గుణరంజను న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు వారణాసి దీక్షితులు, నందూరి రామ్మోహన్, వి గోవిందరావు, కొరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, జెస్‌పాల్, హరీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా అన్న సమారాధన

ఇరగవరం: మండలంలోని తూర్పు విప్పర్రు శివారు నారాయణపురంలో గ్రామ దేవత శ్రీ మాలిగైపు రత్తమ్మ తల్లి అమ్మవారి వారికోత్సవ వేడుకలు ఘనంఆ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 5వేల మందికి ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణకు అధునాతన పరికరాలు



ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: క్షయ వ్యాధి నిర్ధారణకు అధునాతన పరికరాలు అత్తిలి పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ భాను నాయక్ అన్నారు. క్షయ నివారణ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి పరీక్షలు చికిత్సలు అందజేయాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతీ నెలా ఆరోగ్య పోషణ నిమిత్తం ప్రభుత్వం నుంచి వెయ్యి రూపాయలు మంజూరు చేస్తుందని, వీటిని వినియోగించుకుని మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్షయవ్యాధి సూపర్‌వైజర్లు కె గిరిబాబు, కె రమేష్ పాల్గొన్నారు.

స్వీడన్ ఫెలోషిప్ అందుకున్న విజయలక్ష్మి



స్వీడన్ ఫెలోషిప్ అవార్డును అందుకున్న కొల్లా విజయలక్ష్మి కుమారి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన దిశా ప్రొటెక్షన్ సంస్థ ప్రతినిధి కొల్లా విజయలక్ష్మి కుమారి స్వీడన్ ఫెలోషిప్ సంస్థ అవార్డును దక్కించుకున్నారు. ఈ అవార్డును సోమవారం అందుకున్నట్లు విజయలక్ష్మి కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. దిశా ప్రొటెన్ సంస్థ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని విజయలక్ష్మి కుమారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, వెలిశెట్టి నరేంద్రకుమార్, సూర్పని రామకృష్ణ, సేవాదళ్ మండల చైర్మన్ కొండుబోయిన కృపావరం తదితరులు అభినందించారు.

కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) 32వ వార్షికోత్సవం మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో యూనియన్ నాయకులు కృష్ణ అధ్యక్షతన జరిగింది. నీరుకొండ లక్ష్మీనారాయణ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. కార్మిక వర్గం బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు మంచం కోడ్ల పేరుతో కార్మికులను కట్టుబానిసులుగా మారుస్తుందన్నారు. కార్మిక వర్గం శ్రమ శక్తిని దోచి పెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో యజమానులు కార్మిక చట్టాలను అమలు చేయకపోతే, వేతనాలు సకాలంలో కట్టకపోతే, వేతనాలు సకాలంలో పెంచకపోతే, వేతనాల్లో కోతలు పెడితే ఉండే శిక్షలు మోదీ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తోందన్నారు. కార్మికులు జన్మహక్కుగా భావించే సమ్మెహక్కును నిర్వీర్యం చేస్తుందని యూనియన్ పెట్టుకోకుండా ఏ హక్కులు లేకుండా చేస్తుందని ఆందోళన చేశారు. నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా నార్మల్ కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఏలూరు వేణు, సెక్రటరీ తంగేటి శ్రీను, జాయింట్ సెక్రటరీగా వార సురేష్, కమిటీ సభ్యులుగా ఎలమంచిలి అప్పారావులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వది శ్రీను, సత్తి కోదండరామిరెడ్డి, వడిసెల శ్రీను, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం



తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: ఇంటిచెత్తను ఇంటి గుమ్మంలోకి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించాలని, డ్రెయినేజీల్లో పారవేయరాదని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డు టేకివారి వీధిలో గ్రౌండ్ లెవెల్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్ ను పరిశీలించి మాట్లాడారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. మన జీవన విధానంలో ఆరోగ్యకరమైన మార్పులు వస్తేనే దోమల నివారణ సాధ్యమని వివరించారు. స్థానికంగా గుర్తించిన పారిశుద్ధ్య సమస్యలను వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో ఏఎన్‌ఎంలచే అప్లోడ్ చేయించారు. అనంతరం వ్యాధులు వాటి నివారణకు అనుసరించాల్సిన అంశాలను తెలిపే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎ.ఎన్.ఎం ఎస్.భాను శ్రీ., వార్డ్ హెల్త్ సెక్రెటరీ బి.శిరీష, ఆశా కార్యకర్త ఈ.లలిత పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

అత్తిలి: మంచిలి అయ్యప్పకాలనీలో అయ్యప్ప స్వామి ఆలయ పునఃనిర్మాణ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అయ్యప్పస్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన రథంపై అయ్యప్పస్వామి వారి ఉత్సవ మూర్తిని ఉంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, వివిధ రకాల వేషధారణల నడుమ ఊరేగించారు. శిరగాని నాగు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన ఈకార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బీవీఆర్‌లో కళా సేవా కార్యక్రమాలు



బీవీఆర్‌లో కూచిపూడి నృత్య కళాకారులకు అభినందనలు చెబుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ రంగస్థల కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కళా సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. బీవీఆర్ కళాకేంద్రంలో మంగళవారం రాత్రి కళాకారులచే నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం జరిగింది. ప్రజలు, సాహితీ సభ్యులు, కళాకారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. నటరాజ నృత్య నికేతన్ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో కూచిపూడి జానపద నృత్యాలు చేశారు. ప్రేక్షకులను అలరించాయి. సభ కార్యక్రమానికి బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహించారు. భీమవరం స్వామిజీ బృందంచే నాదస్వర సంగీతం, సభా, సత్కారాలు జరిగాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిమామిళ్ల పెద్దిరాజు, సభా ప్రారంభకులు ఎన్‌వీ రమణారావు, పీటీ వెంకన్నలు వ్యవహరించారు. గౌరవ సేవా పురస్కారం పోతుల అన్నవరానికి, కళా సేవా పురస్కారం ప్రముఖ నాదస్వర విద్వాంసులు భీమవరం స్వామిజీకు ఇచ్చారు. ఉద్యోగ సేవా పురస్కారాలను ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్, ఈఓపీఆర్డీ ముప్పిడి వెంకటేష్‌కు అందజేశారు. ఆర్థిక సత్కారాలు నిర్వహించారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



హైదరాబాద్‌లో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: రాష్ట్రస్థాయి మ్యాథ్స్ అండ్ సైన్స్ ఒలింపియాడ్‌లో స్థానిక రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎల్‌కే త్రిపాఠి తెలిపారు. రాష్ట్రస్థాయిలో 4వ తరగతి విద్యార్థిని ఉత్కర్ష త్రిపాఠి మొదటి ర్యాంకు, జిల్లా స్థాయిలో 6వ తరగతి విద్యార్థిని ఎల్.శ్రావణి, 9వ తరగతి విద్యార్థి బి.వేణుగోపాల్ మొదటి ర్యాంకులు, 8వ తరగతి విద్యార్థిని పి.తపస్వి, 7వ తరగతి విద్యార్థి జి.శ్యామ్‌సుందర్ రెండవ ర్యాంకులు సాధించి గోల్డ్‌మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్స్, రూ. 5వేలు నగదు బహుమతి అందుకున్నట్లు వివరించారు. ఈనెల 16వ తేదీన హైదరాబాద్ నాంపల్లి లలిత కళాతోరణం ఆడిటోరియంలో సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ నైట్‌లో సుచిరిండియా ఎండీ అండ్ సీఈవో వై.కిరణ్, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రముఖ సినీనటుడు రావు రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై వారి చేతులమీదుగా రూట్స్ స్కూలు ప్రిన్సిపాల్ ఎల్‌కే త్రిపాఠి గురుబ్రహ్మ (బెస్ట్ టీచర్) అవార్డు దక్కించుకున్నట్లు తెలిపారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థులతోపాటు త్రిపాఠిని స్కూల్ డైరెక్టర్స్ బి.విద్యాకాంత్, ఎస్.సుధాకర్‌వర్మలు ప్రత్యేకంగా అభినందించారు.

కృష్ణాయపాలెంలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ పీఎంకే.జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకుని పీపీ–1, పీపీ–2 విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రథమ్ జిల్లా అధికారి ఆకుల వెంకట్, పాఠశాల హెచ్‌ఎం జి.కనకదుర్గ, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

భీమవరం: భీమవరం లయన్స్ క్లబ్ చేసిన కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణంరాజు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మల ఎంటర్‌ప్రైజెస్ సురేంద్ర, లక్ష్మి ఆక్వా కేర్ అరవ ప్రసాద్ ఆర్థిక సౌజన్యంతో ముగ్గురు విద్యార్థులకు ఉచితంగా సైకిల్స్ పంపిణీ చేశారు. భీమవరం లయన్స్ క్లబ్ 2024– 25కిగాను రూ.24.50 లక్షలు సేవా కార్యక్రమాలను నిర్వర్తించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కె.వేణుబాబు, పేరిచర్ల మూర్తి రాజు, గోపిశెట్టి మురళీ కృష్ణారావు, బొండాడ కుమార వెంకటరత్నం, నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, వబిలిశెట్టి శెట్టి కనకరాజు, వేగిరాజు విశ్వనాథరాజు, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు

ఎరువుల అధిక వినియోగం.. అనర్థదాయకం



పైరుకు ఎరువులు పిచికారీ చేస్తున్న రైతు

తాడేపల్లిగూడెం రూరల్: ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుంది. రైతులు పంట అవసరానికి మించి ఎరువులు, రెండు, మూడు రకాల పురుగు మందులను కలిపి వినియోగించడం వల్ల తెగుళ్లు సైతం దాడి చేస్తాయని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా వాతావరణం, నీరు, నేల కాలుష్యం ఏర్పడుతుందని చెబుతున్నారు. పంట దిగుబడుల కోసం అధిక మోతాదులో ఎరువులను వినియోగించడం వల్ల దిగుబడులు మాట ఎలా ఉన్నా మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తెగుళ్లను తట్టుకునేలా వరి రకాలు

తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధి తాడేపల్లిగూడెం మండలంలో 24,300 ఎకరాలు, పెంటపాడు మండలంలో 21,500 ఎకరాలు, గణపవరం మండలంలో 11,050 ఎకరాలు దాళ్వా వరి పంట సాగవుతుంది. ప్రధానంగా ఎంటీయు 1121 (శ్రీధృతి), పీఆర్ 126, ఎస్‌ఎల్ 10, ఎంటీయు 3626 రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ రకాలన్నీ కాండం తొలుచు పురుగు, ఆకు ముడత, దోమను తట్టుకునే రకాలు. నాట్లు వేసిన 45 రోజుల వరకు ఎటువంటి పురుగు మందులను పిచికారి చేయవలసిన అవసరం లేదు. ప్రతీ వారం ఒక కొత్తపిలక, ఒక కొత్త ఆకు వస్తుంది. రైతులు ఎటువంటి పురుగులు ఆశించకపోయినా విచక్షణా రహితంగా పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. దీనివల్ల మిత్ర పురుగులైన సాలీడు, అక్షింతల పురుగులు, తూనీగలు, కందిరీగలు, మిడ్‌బగ్, మిడతలు తదితర పురుగుల మృతి చెందుతాయని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు. వరికి పునరుత్పత్తి సామర్థ్యం ఎక్కువ. దీనివల్ల రైతులు ఆలోచించి ధోరణి పాటించి అవసరమైన సమయంలో మాత్రమే పురుగు మందులు పొట్ట తగిలిన తర్వాత మాత్రమే పిచికారి చేయాలి.



మిశ్రమ ఎరువులు

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి



రైతాంగం అవసరానికి మించి పురుగు మందులు పిచికారీ చేయవద్దు. భూసారం, పైరుపై తెగుళ్లకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలి. తద్వారా రైతులు సాగులో ఖర్చులు తగ్గించుకోవచ్చు. లేకుంటే భూసారం దెబ్బతినడంతో పాటు ఆహారంలో పురుగు మందుల అవశేషాలు లభిస్తాయి.

– పి.మురళీకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు, తాడేపల్లిగూడెం